క్లుప్తంగా

విధుల్లో చేరిన కర్నూలు డీఎస్పీ


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్

కర్నూలు: కర్నూలు డీఎస్పీగా నియమితులైన జె.బాబుప్రసాద్ సోమవారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడున్న విజయశేఖర్‌ను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేసి కర్నూలు దిశ మహిళా పీఎస్‌లో ఉన్న బాబుప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడిన సంగతి తెలిసిందే. కడప జిల్లాకు చెందిన బాబుప్రసాద్ 1991లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరారు. పదోన్నతులు పొంది అనంతపురం, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పనిచేశారు. గత ఫిబ్రవరిలో జరిగిన బదిలీల్లో భాగంగా కర్నూలుకు వచ్చి దిశ పీఎస్‌లో ఆరు మాసాల పాటు విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన్ను కర్నూలు డీఎస్పీగా నియమించడంతో సోమవారం విజయశేఖర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కను నాటి నీరు పోస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ

కర్నూలు (హాస్పిటల్): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. సోమవారం మెడికల్ కళాశాల యూజీ హాస్టల్‌లో ‘తల్లి పేరిట ఒక చెట్టు’ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ విజయశ్రీ, హాస్టల్ చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు, వైద్యాధికారులు సోమశేఖర్, యు.వెంకటేశ్వర్లు, జయరాం, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్‌చేశారు. సోమవారం సుందరయ్య భవన్‌లో న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బళ్లారిచౌరస్తా, బస్టాండ్, రాజ్‌విహార్ నుంచి పాతబస్టాండ్ వరకు, రాజ్‌విహార్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఆయా మార్గాల్లో ఫ్లైఓవర్లను నిర్మించాలన్నారు. ఓల్డ్‌సిటీలో డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆయాలు, నైట్ వాచ్‌మన్లను ఆదుకోవాలి

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో పని చేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, వై.నాగేశ్వరావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కర్నూలు ఎంఈఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా లు, నైట్ వాచ్‌మెన్లు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. స్కూళ్లలో టాయిలెట్లు, తరగతి గదులు, స్కూల్ ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న ఆయాలు, రాత్రి వేళల్లో కాపలాగా ఉండే వాచ్‌మన్లకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం బాధకరమన్నారు. వెంటనే వేతనాలు మంజూరు చేయాలని, ఆయాలకు జాబ్ చార్ట్ విడుదల చేయాలని కోరారు. అనంతరం కర్నూలు రూరల్, అర్బన్ ఎంఈఓలు వినోద్‌కుమార్, విజయ్ కుమార్‌లకు వినతి పత్రాలను అందజేశారు.

వేతనాలు ఇవ్వండి.. మహాప్రభో

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు పంచాయతీలోని స్వచ్ఛ భారత్ కార్మికులకు బకాయిపడిన మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ కార్మికులకు నెలకు రూ.6 వేల ప్రకారం వేతనాలు ఇస్తున్నారని, వాటిని కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.వేతనాలను రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని కోరారు. నాయకులు బతుకన్న, కృష్ణ, రాముడు ఉన్నారు.

ఉద్యోగ ఖాళీలు వెల్లడించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.లెనిన్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఆ సంఘం జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించకపోవడం అన్యాయమన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పలు శాఖల పరిస్థితులను వివరిస్తూ శ్వేతపత్రాలు విడుదల చేశారని, ఆయా శాఖల్లో ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేసి భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు బీసన్న, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నాడు మెరుగుబడి - నేడు తడబడి

- పేద విద్యార్థుల చదువులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నిధులు లేవంటూ బడుల్లో సౌకర్యాల కల్పనపై చేతులెత్తేసిన వైనం
- నాణ్యత లేని భోజనం... అందని శుద్ధ జలం
- పాత దుస్తులతోనే పాఠశాలలకు విద్యార్థులు
- టాయిలెట్ల నిర్వహణ శూన్యం, ఆయాలకు అందని వేతనాలు
- వంట ఏజెన్సీలు, ఆయాల మార్పునకు పచ్చ నేతల ఒత్తిళ్లు


బి.క్యాంప్‌లోని బాలికల హైస్కూల్‌లో యూనిఫాం అందించకపోవడంతో సాధారణ దుస్తుల్లో వచ్చిన బాలికలు


కేవీఆర్ గార్డెన్ ఉర్దూ స్కూల్లో నిలిచిన నిర్మాణ పనులు

ఐదేళ్లలో విడుదలైన మొత్తం వివరాలు ...

సంవత్సరం	విద్యాదీవెన అందుకున్న విద్యార్థులు	విడుదలైన మొత్తం	వసతి దీవెన అందుకున్న విద్యార్థులు	విడుదలైన మొత్తం
2019-20	9351	రూ.247567902	9329	రూ.90985000
2020-21	14336	రూ.248661687	14280	రూ.139292500
2021-22	9762	రూ.206798909	9756	రూ.88707800
2022-23	9091	రూ.173712183	8826	రూ.80145700
2023-24	7087	రూ.62594583	1594	రూ.3157200
మొత్తం	49627	రూ.939335264	43785	రూ.402288200

కర్నూలు సిటీ: సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికాన్ని దూరం చేసి నిరుపేదల తలరాతను మార్చగలిగే శక్తి అక్షరానికి మాత్రమే ఉందని నమ్మి దేశంలో ఎక్కడా కూడా లేని విధంగా ప్రభుత్వ స్కూళ్లలో సరికొత్త సంస్కరణలు తీసుకొచ్చింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఆ సంస్కరణలు కొనసాగితే తమ కూటమికి రాజకీయ మనుగడ ఉండదనే కారణంతో పేదల చదువుకు పచ్చ చెదలు పట్టించేందుకు ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వ బడుల్లో నేలబారు చదువులు ఉండకూడదని, చక్కని తరగతి గది, ప్రశాంత వాతావరణంలో పెత్తందారుల పిల్లలతో సమానంగా పేద పిల్లలు చదువుకోవాలని గత ప్రభుత్వాధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య వ్యవస్థల్లో మార్పులకు శ్రీకారం చుట్టారు. సర్కార్ బడుల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, పౌష్టికాహారం, చక్కని యూనిఫాం, బూట్లు, బెల్టులతో స్కూళ్లకు హాజరయ్యేలా, ఏ పేదింటి బిడ్డ కూడా ఆర్థిక భారంతో చదువుకు దూరం కాకూడదని పాఠశాల విద్యార్థులకు అమ్మ ఒడి, కాలేజీ విద్యార్థులకు విద్య దీవెన, వసతి దీవెనతో పాటు, పెత్తందారులకు మాత్రమే పరిమితమైన డిజిటల్ విద్యను పేదలకు దరి చేర్చారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ సంస్కరణలను ఒక్కోదాన్ని తొలగించేందుకు కుట్రలు చేస్తుంది. నాణ్యమైన చదువును పేదలకు దూరం చేసేలా టోఫెల్ శిక్షణకు సైతం సెలవు చెప్పేశారు. వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు పునఃప్రారంభమై రెండు నెలలు అవుతున్నా నేటికి విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదు. దీంతో పాటు కొత్తగా ప్రవేశాలు పొందిన పిల్లలకు విద్యార్థి కిట్లు చాలా మందికి అందించలేదు. యూనిఫాం సైతం అందించకపోవడంతో విద్యార్థులు పాత దుస్తులతోనే బడులకు వస్తున్నారు.

పెట్టిందే తినాలి !



ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి గత ప్రభుత్వం గోరుముద్ద అని పెట్టిన పేరును ప్రస్తుత కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా మార్పు చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన మోనును కొనసాగిస్తున్నా నాణ్యత విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. దీనిపై ప్రశ్నిస్తే టీడీపీకి చెందిన ఏజెన్సీల నిర్వాహకులు హెచ్‌ఎంలతో వాగ్వాదానికి దిగుతున్నారు. స్కూళ్లలో మెనూ గురించి అడిగితే మేము పెట్టిందే తినాలి అంటూ బెదిరిస్తున్నారు. వంట ఏజెన్సీలను టీడీపీకి చెందిన వారికి గుట్టు చప్పుడు కాకుండా కట్టబెట్టడడంతో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు.

భోజనం రుచి, శుచి లేకపోవడంతో తినలేక పారబోసిన దృశ్యం

విద్యార్థి కిట్లకు పాట్లు

కర్నూలు అసెంబ్లీ పరిధిలో అన్ని యాజమాన్యాలకు చెందిన స్కూళ్లు 291 ఉన్నాయి. ప్రభుత్వ, మున్సిపల్ స్కూళ్లు సుమారుగా 116 ఉండగా, 20 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది యూడైస్ ప్రకారం 18,605 మందికి విద్యార్థి కిట్లు అందించేందుకు ఇండెంట్ పెట్టారు. కొత్తగా ప్రవేశాలు పొందిన సుమారు 2 వేల మందికి కిట్లు అందలేదు. ఒక్కరికి కూడా యూనిఫాం ముట్టలేదు.

నాడు–నేడుకు నిధుల్లేవు !

అసెంబ్లీ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు మొదటి విడత కింద 5 హైస్కూళ్లు, రెండో విడతలో 78 స్కూళ్లలో అభివృద్ధి పనులు మొదలు పెట్టారు. ఈ స్కూళ్లన్నింటిలో ప్రస్తుతం నిధుల కొరతతో పనులు నిలిపి వేశారు. 116 స్కూళ్లలో రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయిలెట్లు నిర్మించారు. వీటిని ప్రతి రోజు శుభ్రం చేసేందుకు 130 మంది ఆయాలను ఏర్పాటు చేసి టాయిలెట్ల శుభ్రతకు రసాయనాలను సైతం పంపిణీ చేసే వారు. అయితే ప్రస్తుతం ఈ ఆయాల కొనసాగింపుపై ఎలాంటి స్పష్టత రాకపోగా నాలుగైదు నెలలుగా వేతనాలు కూడా ఇవ్వడం లేదు. నైట్ వాచ్‌మన్ల పరిస్థితి కూడా అంతే. వీరి కొనసాగింపుపై స్పష్టత రాకపోగా, అధికార పార్టీకి చెందిన వారు తమవారిని ఆయాలుగా, నైట్ వాచ్‌మన్లుగా నియమించాలని అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు.


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించకుండా వదిలేసిన దృశ్యం


డ్రమ్ములో పోసిన నీళ్లతో ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థినులు

అమ్మ ఒడితో.. పై చదువుకు భరోసా

నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలను స్కూళ్లకు పంపితే చాలు ఏడాదికి రూ.15 వేలు అమ్మ ఒడి కింద ఇస్తానని చెప్పిన మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి మొదటి ఏడాది నుంచే అమలు చేశారు. దీని ద్వారా కర్నూలు అసెంబ్లీలో ఈ పథకం ద్వారా 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 36 వేల మంది విద్యార్థులకు నాలుగేళ్లలో మొత్తం రూ.235 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు గడిచినా ఈ పథకంపై ఎలాంటి స్పష్టత లేదు. ఎన్నికల సమయంలో.. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలున్నా అందరికీ రూ.15వేల చొప్పున అందిస్తామని చెప్పిన కూటమి పార్టీల నాయకులు ప్రస్తుతం అసెంబ్లీలో ఓటాన్ బడ్జెట్ ప్రవేశపెట్టి ఏడాదిపాటు ఈ పథకానికి మంగళం పాడేశారు.

డిప్యూటేషన్‌తో కొరతను పూడ్చారు..!

కర్నూలు అసెంబ్లీ పరిధిలో 102 మున్సిపల్ స్కూల్స్ ఉన్నాయి. ఈ స్కూళ్లలో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు విద్యాశాఖ అధికారులు తాత్కాలికంగా డిప్యూటేషన్ ద్వారా చర్యలు చేపట్టారు. ఇటీవల రిటైర్ అయిన వారు, అనారోగ్యం, తదితర కారణాలతో ఖాళీగా ఉన్న సుమారు 25 పోస్టులను పని సర్దుబాటు ద్వారా భర్తీ చేస్తున్నారు.

ఉన్నత చదువుకు అండగా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో 2019 నుంచి 2024 వరకు 93,412 మంది విద్యార్థులు లబ్ధిపొందారు. ఇంత మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి నాటి ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రభుత్వం రూ.134,16,23,464లను జమ చేసింది.

నిలిచిపోయిన డిజిటల్ చదువులు

కర్నూలు అసెంబ్లీలోని ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టారు. మెమోరీకార్డులు లేకపోవడంతో చాలా చోట్ల డిజిటల్ విద్య అందడం లేదు. 8 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు అప్‌డేట్ చేయలేదు.

ఫీజు భారంతో ఇబ్బంది



మాకు ఇద్దరు పిల్లలు. చిరు వ్యాపారం చేస్తూ అద్దె ఇంట్లో ఉంటూ పిల్లలను చదివించుకుంటున్నాం. అమ్మ ఒడి, వసతి దీవెనతో మాలాంటి వారి పిల్లల చదువులకు ఇబ్బందులు ఉండేవి కాదు. ఈ ఏడాది ఇంకా ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. ఆలస్యం కాకుండా ఇస్తే పిల్లల ఫీజులకు భారం కాకుండా ఉంటుంది.

– విజయలక్ష్మి, బృందావన్ నగర్, కర్నూలు

సౌకర్యాలు కల్పించాలి



పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వసతుల కల్పన పనులు మొదలు పెట్టింది. వారు చేపట్టిన పనులను నిధుల కొరత ఉందని కూటమి ప్రభుత్వం నిలిపివేయడం దారుణం. పనులు ఆగిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి అన్ని స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– నాగరాజు, ఏఐఎస్‌ఏ, రాష్ట్ర అధ్యక్షుడు

నేటికి యూనిఫాం అందించలేదు



విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతోంది. ఇంతవరకు విద్యార్థులకు పుస్తకాలే పూర్తి స్థాయిలో అందించలేదు. విద్యార్థి కిట్లలో పంపిణీ చేసే వస్తువులు కొన్ని ఇచ్చి మిగతావి తర్వాత ఇస్తామని చెప్పారు. అయితే ఇప్పటివరకు చాలా మందికి ఇవ్వలేదు. విద్యా సంవత్సరం రోజునే ఇవ్వాల్సిన యూనిఫాం రెండు నెలలు అవుతున్నా ఇవ్వకపోవడంతో ఆగస్టు 15వ తేదీన పాత దుస్తులతోనే స్వాతంత్య్ర వేడుకలకు విద్యార్థులు హాజరుకావాల్సిన పరిస్థితి.

– ఎస్.శరత్‌కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు

రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): స్కీం వర్కర్లయిన ఫీల్డ్‌అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు, వీఏఓ, ఆర్‌పీలపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్కీం వర్కర్లను వేధించడం, తొలగించడం అన్యాయమన్నారు. ప్రధానంగా ఆదోని, కౌతాళం మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కోడుమూరు, ఎమ్మిగనూరు, కల్లూరు మండలాల్లో పలు చోట్ల వంట ఏజెన్సీలను తొలగించి టీడీపీ సానుభూతిపరులకు బాధ్యతలు అప్పగించారని, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెప్మా పరిధిలో పని చేస్తున్న ఆర్పీలను సైతం తొలగించి అనుచరులను నియమించుకునేలా టీడీపీ నాయకులు ప్రయత్నం చేస్తున్నారని, ఇందుకు అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపించారు. ఇలాంటి చర్యలన్నీ మానుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు జీ.నాగేశ్వరరావు, విజయ్, పెద్దిరాజు నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలకై నిరసన


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

కర్నూలు(సెంట్రల్): ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న 10 వారాల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ఉపాధి పనులు చేస్తే వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. టీడీపీఅధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా పెండింగ్ బకాయిలు రూ.1100 కోట్లు చెల్లించడం లేదని వాపోయారు. మరోవైపు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయంగా వేధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు నబీరసూల్, భాస్కర్‌యాదవ్, శేషుకుమార్, సోమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ వైద్యులకు భత్యం ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్): టీచింగ్ హాస్పిటల్స్‌లో పని చేస్తున్న ఫోరెన్సిక్ వైద్యులకు పోస్టుమార్టం భత్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ నాయకులు సోమవారం విజయవాడలో డీఎంఈ డాక్టర్ నరసింహంకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. ఫోరెన్సిక్ వైద్యులు కోర్టు విధులకు హాజరయ్యేందుకు టీఏ, డీఏ ఖర్చులను మంజూరు చేయాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.సాయిసుధీర్, జనరల్ సెక్రటరీ సుబ్బారావు, మెంబర్లు సుజ్ఞాన్, మహేష్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై ధర్నా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ హాస్టళ్లలో భోజనం బాగుండడం లేదని, విద్యార్థులు తినలేక పోతున్నారన్నారు. అలాగే జూనియర్, డిగ్రీ కళాశాలలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న హఫీజ్ కరీముల్లా

కర్నూలు కల్చరల్: హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముస్లిం రాష్ట్రీయ మంచ్ సంయోజక్ (అధ్యక్షుడు) షేక్ హఫీజ్ కరీముల్లా సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3న ముస్లిం రాష్ట్రీయ మంచ్ జాతీయ అధ్యక్షుడు ఇంద్రేష్ కుమార్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రాల ముస్లిం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.ఆర్‌ఎస్‌ఎస్‌లో భాగంగానే రాష్ట్రీయ మంచ్ పనిచేస్తుందన్నారు. హిందూ ముస్లింలు ఒక్కటేనన్న నినాదంతో పని చేస్తామన్నారు.కొందరు హిందూ ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్నారని, ఇలాంటివాటిని రూపు మాపడానికి రాష్ట్రీయ మంచ్ ఏర్పాటైందన్నారు. త్వరలోనే తెలుగు రాష్ట్రాల్లో కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి




ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

కర్నూలు (టౌన్): ప్రజల నుంచి వచ్చిన వినతులను జవాబుదారీతనంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో కమిషనర్ ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 11 మంది దరఖాస్తులను అందజేశారు. ఎస్‌ఈ వేణు గోపాల్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డీసీపీ సంధ్యారాణి, కార్యదర్శి నాగ రాజు, ఆర్ఓ జునీద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, డీపీఓ ఉమేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- తమ కాలనీలో అసంపూర్తిగా ఉన్న రహదారి, మురుగు కాల్వల పనులు పూర్తి చేయాలని బాలాజీ నగర్‌కు చెందిన అబ్రహం లింకన్, సుధామణి విన్నవించారు.ఇవే సమస్యలపై అపూర్వ శిల్పారామం కాలనీకి చెందిన జయరాజు, రామ్‌నగర్‌కు చెందిన శ్రీరాములు, ఉల్చాల రోడ్డులో ఉన్న స్కందాన్షి లోటస్ విల్లాస్ వెంచర్ నివాసితులు విన్నవించారు.
- నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని జొహరాపురం రహదారిలో ఉన్న పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని బీజేపీ నాయకులు రాంమోహన్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- రేణుకా నగర్, రాధానగర్‌లలో సరైన సదుపాయాలు లేవని స్థానికంగా కొంత మంది పార్కు స్థలాన్ని కబ్జా చేశారని రత్నారెడ్డి, శ్రీరాములు ఫిర్యాదు చేశారు.
- నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ధనలక్ష్మీ నగర్‌లో రోడ్డు మరమ్మతులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, నీటిసరఫరా సమయం పెంచాలని ధనలక్ష్మీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి విన్నవించారు.
- పెద్దపాడులో రహదారి, బృందావన్ కాలనీలో వీధిదీపాలు లేవని స్థానికులు కె.శ్రీనివాసులు మూర్తి ఫిర్యాదు చేశారు.

వినతులు స్వీకరించిన ఎస్‌డీసీలు

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులకు తగిన పరిష్కారాలు చూపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, విశ్వనాథ్, నాగప్రసన్నలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ విజయవాడలో జరిగే సదస్సులో పాల్గొనేందుకు వెళ్లడం, జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండడం, డీఆర్వో కలెక్టర్ల సదస్సు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనడంతో ఉన్నతాధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లే ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వారు మాట్లాడుతూ.. నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సివిల్ 9.. మెకానికల్ 2

కర్నూలు కల్చరల్: ఏపీ ఈఏపీసెట్–2024 ఫైనల్ ఫేజ్ ఇంజినీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఆర్‌యూసీఈ)లో ఐదు బ్రాంచ్‌లు ఉండగా 396 సీట్లకుగాను 231 మంది చేరారు. సివిల్ ఇంజినీరింగ్‌లో 66 సీట్లు ఉండగా కేవలం తొమ్మిది మంది, మెకానికల్‌లోనూ 66 సీట్లకు గాను ఇద్దరే అడ్మిషన్ తీసుకున్నారు. ఇంజినీరింగ్‌లో కోర్ బ్రాంచ్‌లపై ఈ ఏడాది కూడా విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఇదే కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కోర్సులో 66 సీట్లు ఉండగా 53, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో 132 సీట్లు ఉండగా 109, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 66 సీట్లు ఉండగా 58 భర్తీ అయ్యాయి.

డిగ్రీ ‘స్పాట్’ కేంద్రం తనిఖీ

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ బీఈడీ కళాశాలలోని రాయలసీమ విశ్వవిద్యాలయం డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం కేంద్రాన్ని సోమవారం వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తనిఖీ చేశారు. పొరపాట్లకు తావు లేకుండా మూల్యాంకనం చేయాలని, షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. త్వరలో నిర్వహించనున్న పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు వీలుగా ఫలితాలను విడుదల చేయాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.వెంకటేశ్వర్లు, క్యాంప్ ఆఫీసర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి ఉన్నారు.

హిందూ వ్యతిరేక శక్తులను తిప్పికొట్టాలి

కర్నూలు కల్చరల్: హిందూ వ్యతిరేక శక్తులను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ప్రముఖ జర్నలిస్ట్ రాకా సుధాకర్ అన్నారు. కర్నూలు సమాలోచన శాఖ ఆధ్వర్యంలో సోమవారం వీఆర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మేధావుల వేదిక కార్యక్రమం జరిగింది. ‘మణిపూర్‌లో హింస – వాస్తవ పరిస్థితి’, హిందువుల హింసావాది – ఒక పరిశీలన’ అనే అంశాలపై ఆయన ప్రసంగించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ముఖ్యంగా మణిపూర్‌లో సెక్యులర్ ముసుగులో జరుగుతున్న హిందూ వ్యతిరేక కార్యకలాపాలపై ప్రతిఒక్కరూ జాగురూకతై ఉండాలన్నారు. కార్యక్రమ సంయోజక్ మల్లికార్జునరావు, వాసురెడ్డి, రఘురామయ్య పాల్గొన్నారు.

లోకేశ్ హామీ నిలుపుకోవాలి

కర్నూలు(సెంట్రల్): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో చెప్పిన మాట ప్రకారం జీఓ నంబర్ 77ను రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గేటు ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం గాయత్రీ ఎస్టేట్ నుంచి కలెక్టరేట్ వరకు ఏబీవీపీ నాయకులు ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే ఏపీఐసెట్ కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేసి ఫీజురీయింబర్స్‌మెంట్‌పై నిర్ణయం ప్రకటించిన తరువాతే నిర్వహించాలని కోరారు. నాయకులు మహమ్మద్, లోకేష్ పాల్గొన్నారు.